పాలకొల్లులో వర్షం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు లో శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. దీంతో గత వారం రోజులుగా తీవ్ర ఎండలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు ఉపశమనం లభించింది. అయితే మహిళలు వరలక్ష్మి వ్రతం సందర్భంగా దేవాలయాలకు వెళ్లేందుకు ఆటంకం కల్గింది. వర్షం కురియడంతో మండలంలో వరి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎండల ప్రభావంతో దుబ్బులు ఎండి పోతున్నాయని, ఈ వర్షంతో ఆ ఇబ్బంది కొంత తొలగుతుందని చెబుతున్నారు.

కార్పొరేషన్ రుణాలు ఇచ్చేనా..!

ఎస్‌సి, బిసి, కాపు కార్పొరేషన్ రుణాల మంజూరుపై అయోమయం

దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించి అర్థాంతరంగా నిలిపివేత

రెండు జిల్లాల్లో ఐదు వేల యూనిట్లు ఇస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటనలు

ఉపాధి కోసం వేలాది మంది అర్హుల ఎదురుచూపు

సామాన్యుల గోడు పట్టించుకోని కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వం ఎస్‌సి, బిసి, కాపు కార్పొరేషన్ రుణాలపై వ్యవహరిస్తున్న తీరు జనాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కార్పొరేషన్ రుణం మంజూరైతే ఉపాధి దొరుకుతుందని ఎదురుచూస్తున్న వేలాది మంది పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత వైసిపి ప్రభుత్వం కార్పొరేషన్ రుణాలు ఇవ్వకుండా ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, బిసి, కాపు సామాజిక తరగతులను మోసం చేసిందంటూ కూటమి నేతలు ఎన్నికల్లో విమర్శలు గుప్పించారు. తాము అధికారంలోకి వస్తే మళ్లీ కార్పొరేషన్ రుణాలు పునరుద్ధరిస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఈ ఏడాది మార్చిలో బిసి, కాపు కార్పొరేషన్ రుణాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేశారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో బిసి కార్పొరేషన్ కింద 3,600 యూనిట్లు, కాపు కార్పొరేషన్ కింద

1,387 యూనిట్లు, ఇడబ్ల్యూఎస్ కోటా కింద 215 యూనిట్లు మంజూరు చేసినట్లు ప్రకటనలు సైతం ఇచ్చారు. మార్చి పదో తేదీ నుంచి 20వ తేదీ వరకూ దరఖాస్తుల స్వీకరణ సైతం చేపట్టారు. దాదాపు 25 వేలకుపైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తేల్చారు. దరఖాస్తుదారులకు మండల పరిషత్ అధికారులు ఇంటర్వ్యూల ప్రక్రియ సైతం పూర్తి చేశారు. ఇంకేముంది కార్పొరేషన్ రుణం వచ్చేసినట్లే అని అంతా అనుకున్నారు. అదే సమయంలో ఎస్‌సి కార్పొరేషన్ రుణాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. మే పదో తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. దాదాపు మూడు వేల దరఖాస్తులు వరకూ వచ్చినట్లు లెక్కలు వేశారు. ఏం జరిగిందో, ఏమో తెలీదు హఠాత్తుగా కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల స్వీకరణను ప్రభుత్వం నిలిపివేసింది. ఎందుకు నిలిపివేశారో కారణాలు సైతం చెప్పలేదు. సాంకేతిక కారణాల వల్ల నిలిపివేసినట్లు చెబుతూ మసిపూసి మారేడు కాయ చేస్తున్న పరిస్థితి ఉంది. కార్పొరేషన్ రుణాల ప్రక్రియను నిలిపివేసి దాదాపు మూడు నెలలు కావస్తోంది. ఇప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా లేకుండాపోయింది.

రుణాలిచ్చేనా అంటూ అనుమానాలు

గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఒక్క కార్పొరేషన్ రుణమూ ఇవ్వలేదు. ఎస్‌సి, బిసి, కాపులకు అందిన సంక్షేమ పథకాల సొమ్మును లెక్కలు చెబుతూ మభ్యపెట్టేందుకు ప్రయత్నించింది. దీంతో ఆయా సామాజిక తరగతుల నుంచి వైసిపి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. కార్పొరేషన్ రుణాలపై సోషల్ మీడియాలో పెద్దఎత్తున విమర్శలు సైతం వెల్లువెత్తాయి. 2019కు ముందు పాలించిన ప్రభుత్వాలు కార్పొరేషన్ రుణాలకు పెద్దపీట వేస్తూ వచ్చాయి. దీంతో ఎన్నో కుటుంబాలు వ్యాపారాలకు సంబంధించిన యూనిట్లు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందాయి. ఇన్నోవా కార్లు వంటివి సైతం కార్పొరేషన్ రుణాల కింద మంజూరు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ కార్పొరేషన్ రుణాలపై అంతా ఆశలు పెట్టుకున్నారు. నోటిఫికేషన్ ఇచ్చినట్లే ఇచ్చి ప్రభుత్వం నిలిపివేసింది. సబ్సిడీపై కార్పొరేషన్ రుణం వస్తే యూనిట్ ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందవచ్చునని వేలాది మంది కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోయింది. ఇప్పటి వరకూ కార్పొరేషన్ రుణాల వ్యవహారం ముందుకు సాగని పరిస్థితి ఉంది. కార్పొరేషన్ రుణాలపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకుని మంజూరు చేయాలని వేలాది మంది కోరుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఎస్‌సి, బిసి, కాపు సామాజిక తరగతుల్లోని యువతకు న్యాయం చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటుందో, లేదో వేచిచూడాలి.

ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసన

భీమవరంలో మాట్లాడుతున్న జెఎన్‌వి.గోపాలన్

నరసాపురంలో..

ప్రజాశక్తి - భీమవరం

ప్రత్యేక సమగ్ర సర్వే పేరుతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా సవరణను రద్దు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక ప్రకాశం చౌక్‌లో శుక్రవారం నిరసన చేపట్టిన నిరసనలో అర్హులందరికీ ఓటు హక్కు ఇవ్వాలని, ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సవరణను ఆపాలని, కేంద్ర ప్రభుత్వ అడ్డగోలు నిర్ణయాలను వ్యతిరేకించాలని నినదించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తమకు వ్యతిరేకంగా ఉన్న రాష్ట్రాల్లో తన పెత్తనాన్ని కొనసాగించడం కోసం, ప్రతిపక్షాల ఓటు బ్యాంకును తొలగించడం కోసం ఈ సవరణను ఆయుధంగా పెట్టుకుందని, దానికి ఎన్నికల సంఘం వత్తాసు పలుకుతుందని అన్నారు. గతంలో ఎన్నికల సంఘం జారీ చేసిన ఓటు గుర్తింపు కార్డులు, ఆధార్ కార్డులను కూడా ఈ సవరణలో పరిగణనలోకి తీసుకోకుండా ఎక్కడ పుట్టావు, ఎప్పుడు పుట్టావు, ఆధారాలు ఏమిటీ అనే పద్ధతుల్లో సర్వే నిర్వహించడం ఉన్న ఓటర్లను తొలగించడానికేనని స్పష్టమవుతుందన్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు కూడా జోక్యం చేసుకుని బీహార్‌లో జరుగుతున్న సర్వేను ఆపాలని తీర్పు చెప్పిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ సర్వేను దేశమంతా అమలు చేయాలని చూస్తుందన్నారు. ఒకపక్క ఎన్నికల ప్రక్రియలోని లోపాలపై చర్చ సాగుతుండగా, మరోపక్క సర్వే పేరుతో ఓటర్లను గందరగోళపర్చడం, తొలగించడం జరుగుతుందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఒక స్వతంత్ర సంస్థగా కాకుండా కేంద్ర ప్రభుత్వం తన జేబు సంస్థగా మార్చేసిందని విమర్శించారు. తక్షణమే ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, ఇంజేటి శ్రీనివాస్, ఎం.ఆంజనేయులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, గోపాలకృష్ణంరాజు, త్రిమూర్తులు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నరసాపురం: ఓటర్ల హక్కులను హరించే ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) వల్ల దేశంలో కోట్లాది మంది ప్రజలు రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును కోల్పోతారన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపర్చే విధంగా వ్యవహరిస్తుందన్నారు. తక్షణం ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు బూడిద జోగేశ్వరరావు, నోముల కొండ, పొగాకు నారాయణరావు, కోడి లక్ష్మణ్, జి.ఆజాద్, కౌరు నరసింహస్వామి, పున్నమి అప్పలనాయుడు, పైలా అప్పలనాయుడు, కాకర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

దర్భరేవు, కొత్తకాయలతిప్ప డ్రెయిన్‌ను పూర్తిస్థాయిలో తవ్వాలి

ఎపి కౌలురైతు, ఎపి రైతుసంఘం నేతల డిమాండ్



నినదిస్తున్న రైతులు, కౌలురైతులు, నేతలు

ప్రజాశక్తి - నరసాపురం

ఏళ్ల తరబడి పూడుకుపోయిన దర్భరేవు, కొత్తకాయలతిప్ప డ్రెయిన్‌ను పూర్తిస్థాయిలో తవ్వాలని ఎపి కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, ఎపి రైతుసంఘం మండల నాయకులు కటకంశెట్టి మాణిక్యాలరావు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు పలువురు రైతులతో కలసి ఎల్‌బిచర్లలో కాలువ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దర్భరేవు డ్రెయిన్‌ను ఆధునికీకరించి 20 ఏళ్లయిందన్నారు. దీంతో పూడికతో నిండి మురుగు, ముంపు నీరు లాగక వేలాది ఎకరాల్లో పంటలు సరిగా పండని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలువ ఆధునికీకరణకు సుమారు రూ.45 లక్షల వరకు నిధులు మంజూరు చేశారన్నారు. అయితే కాల్వ పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ కాల్వకు ఇరువైపులా మట్టి తీసి మధ్యలో ఉన్న పూడిక తీయకపోవడంతో నీరు లాగే పరిస్థితి లేదన్నారు. తక్షణమే కాలువ మధ్య నుంచి మట్టి తవ్వాలని డిమాండ్ చేశారు. పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి దర్భరేవు నుండి కొత్తకాయలతిప్ప వరకూ ఆధునికీకరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు సంగాని వెంకటేశ్వరరావు, గుబ్బల శ్రీను, కటకంశెట్టి వెంకటేశ్వరరావు, జుత్తిగ హనుమంతరావు, కడలి తాతయ్య, పోతాబత్తుల నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు ఎలక్ట్రిక్ బైక్‌లు దోహదం

గ్రీన్ ఎకో ఎలక్ట్రిక్ బైక్ షోరూమ్ ప్రారంభోత్సవంలో ఎంఎల్‌ఎ అంజిబాబు



షోరూమ్ ప్రారంభోత్సవంలో అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రానున్న కాలంలో పెట్రోల్‌తో నడిచే బైక్‌లకన్నా పర్యావరణం కలుషితం కాకుండా ఉండే ఎలక్ట్రిక్ బైక్‌లు ఎంతో ఉపకరిస్తాయని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పిఎసి) ఛైర్మన్, స్థానిక ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం-వి స్సాకోడేరు రోడ్డులో గ్రీన్ ఎకో ఎలక్ట్రిక్ బైక్ షోరూమ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ ఎలక్ట్రిక్ బైక్‌లు పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహదపడతాయని, కాలుష్యాన్ని తగ్గిస్తాయని తెలిపారు. తగ్గిస్తుందని అన్నారు. షోరూమ్ నిర్వాహకులు వేంద్ర బాల, వై.శ్రావణి మాట్లాడుతూ గ్రీన్ ఎకో ఎలక్ట్రిక్ బైక్ షోరూమ్‌లో రూ.లక్షకే మూడు ఎలక్ట్రిక్ బైక్‌లను అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఎలక్ట్రిక్ బైక్‌లను ఎంఎల్‌ఎ అంజిబాబు పరిశీలించి, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు.

శ్మశాన భూమితో రాజకీయాలు తగవు

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు

శ్మశన భూమిని పరిశీలిస్తున్న కెవిపిఎస్, దళిత సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఉండి

కేవలం ఇద్దరి స్వార్థ ప్రయోజనాల కోసం దళితుల శ్మశాన భూమితో రాజకీయాలు చేయడం సరికాదని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కారుమంచి క్రాంతి బాబు అన్నారు. శ్మశాన భూమిలో రహదారి నిర్మించొద్దని మండలంలోని పాములపర్రులో దళితులు చేస్తున్న ఆందోళనకు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి క్రాంతి బాబు, అధ్యక్షులు విజయ్, సిపిఎం జిల్లా నాయకులు ధనికొండ శ్రీనివాస్, దళిత ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు గంటా సుందర్ కుమార్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నల్లి రాజేష్ సంఘీభావం తెలిపి స్థానిక టిడిపి నాయకులతో కలిసి శ్మశాన భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా క్రాంతిబాబు మాట్లాడుతూ కేవలం ఒకరిద్దరి స్వార్థ ప్రయోజనాల కోసం సుమారు 200 సంవత్సరాల చరిత్ర కలిగిన పాములపర్రు శ్మశాన వాటికను రాజకీయాలకు ఉపయోగించకూడదని తెలిపారు. దళితుల ఆత్మగౌరవం దెబ్బతినేలా అధికారులు ప్రవర్తించడం దౌర్భాగ్యమని అన్నారు. కొందరు ఆక్వా రైతులు స్థానిక ఎంఎల్‌ఎను తప్పుదోవ పట్టిస్తున్నారని, వారికి అర్థమయ్యే రీతిలో చెప్పాల్సిన బాధ్యత టిడిపి గ్రామ అధ్యక్షులు తోట శ్రీరాములు, రాష్ట్ర కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వర రాజులపై ఉందని అన్నారు. శ్మశాన వాటికలో శవాల మీదుగా రహదారి ఏర్పాటు చేయడం సరికాదని, జీవో నెంబర్ 1235 ప్రకారం దళిత పేటకు రెండెకరాల శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని, దీని ప్రకారం పాములపర్రులో ఉన్న 82 సెంట్లు శ్మశాన భూమి దళితులకే చెందేలా అధికారుల చర్యలు తీసుకోవాలన్నారు. మొదట మండలంలో విధించిన 144 సెక్షన్ ఉపసంహరించుకుని గ్రామం నుంచి పోలీసులు వెనుదిరిగేలా చూడాలని, తద్వారా శాంతియుత వాతావరణం ఏర్పడుతుందని క్రాంతి బాబు సూచించారు. శాంతియుత వాతావరణంలో చర్చలు జరిపి ఈ సమస్యకు పరిష్కారం జరిగేందుకు కృషి చేయాలని అన్నారు. అలాకాకుండా దళితులను పోలీసు కేసులతో బెదిరించాలని చూస్తే అన్ని సంఘాలతో కలిసి ఉద్యమిస్తామని క్రాంతిబాబు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నక్కా వెంకప్ప, దానం విద్యాసాగర్, దర్శి సాల్మన్ రాజు ఉన్నారు.



శ్మశాన భూమిని పరిశీలించి మాట్లాడుతున్న నాయకులు

బార్ అసోసియేషన్ ఎన్నికల్లో 10 పదవులకు ఏకగ్రీవం

మిగిలిన పదవులకు 13న ఎన్నిక

ఎన్నికైన వైదాని నాగేశ్వరరావు, అధ్యక్షులు బూసి విశ్వేశ్వరరావు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికల్లో 10 పదవులకు ఎన్నిక ఏకగ్రీవం అయ్యిందని ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది నల్లిమిల్లి జోసెఫ్ తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో ప్రధాన కార్యదర్శి, కార్యవర్గ సభ్యుల పదవులకు నామినేషన్ వేసిన అభ్యర్థులు పోటీలో నిలిచారని ఆయన వెల్లడించారు. నరసాపురం బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది బూసి విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షునిగా వైదాని నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జోసెఫ్ తెలిపారు. అలాగే అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా నక్కా ఆనంద్ బాబు, లైబ్రరీ కార్యదర్శిగా నారిన శ్రీనివాసరావు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల కార్యదర్శిగా రాయసం రాధారాణి, కోశాధికారి గా పూరిళ్ల శ్రీనివాస్, మహిళా ప్రతినిధిగా గోపిరెడ్డి మణి, సీనియర్ కార్యవర్గ సభ్యులుగా తంగెళ్ల వెంకటేశ్వరరావు, కొల్లాబత్తుల చంద్రశేఖర్, మహిళా కార్యవర్గ సభ్యులుగా ఓసూరి జ్యోతి మాంగల్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని వివరించారు. ప్రధాన కార్యదర్శి పదవికి విన్నా సూర్యప్రకాశ్ రావు, రొక్కాల గ్లాడ్ స్టన్ కుమార్, కార్యవర్గ సభ్యుల పదవులకు కొప్పర్తి వెంకటకృష్ణమూర్తి, పులపర్తి హర్షవర్ధన్, గోరింకల వినోద్ కుమార్, కొల్లాటి ఆదినారాయణ, కంభాల స్వర్ణ పోటీ పడుతున్నారని జోసెఫ్ తెలిపారు. ఈ పదవులకు ఈనెల 13వ తేదీన ఎన్నికలు నిర్వహించి అదేరోజు సాయంత్రం ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడిస్తామని జోసెఫ్ తెలిపారు.

రాజేశ్వరికి బెస్ట్ ఆశా వర్కర్ అవార్డ్

అవార్డు అందుకుంటున్న రాజేశ్వరి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వైద్య ఆరోగ్యశాఖలో కింది స్థాయిలో ప్రజలను ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించడంలో ఆశా వర్కర్లదే ప్రథమ స్థానం అని చెప్పొచ్చు. దీనిలో భాగంగా ప్రభుత్వం తీసుకొచ్చిన కిల్కారి సేవలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సుంకరపతి గారి వీధి అర్బన్ సెంటర్లో పనిచేస్తున్న పి.రాజేశ్వరి కి బెస్ట్ ఆశ కార్యకర్తగా జిల్లా ఆరోగ్యశాఖ అధికారిణి గీతాబాయి అవార్డు అందించారు. ఈ సందర్భంగా గీతాబాయి మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు, కిల్కారి సేవలపై ఆశ కార్యకర్తలు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. రాజేశ్వరి మాట్లాడుతూ కష్టానికి గుర్తింపు దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కిల్కారి ప్రాంతీయ అధికారి బి.రాజు, జిల్లా ఇమ్యూనికేషన్ అధికారిని డాక్టర్ సదాలక్ష్మి, వైద్యశాఖ అధికారులు వెంకటరత్నం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వీడని సాగునీటి కష్టాలు

ఎండిపోతున్న వరిపైరు

శివారు భూముల రైతులు లబోదిబో

చినకామనపూడిలో ఎండిపోతున్న వరి చేలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఖరీఫ్ సాగునీటి కష్టాలు రైతులను వెంటాడుతూనే ఉన్నాయి. ఇంకా మండల శివారు గ్రామాల్లోని గరువు భూములకు సాగునీరు పారలేదు. దీంతో పలు ప్రాంతాల్లోని చేలు ఎండిపోతున్నాయి. రెండు వారాల క్రితం తుపాన్ ప్రభావంతో మండలంలో అడపాదడపా వర్షం కురిసినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఇంకనూ రైతులను నీటి కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. మండలవ్యాప్తంగా వరి నాట్లు చాలా వరకూ పూర్తి కావొచ్చాయి. అయితే శివారు గరువు గ్రామాల్లో భూములకు నీరు ఇంకా పూర్తిస్థాయిలో అందడం లేదు. నీటి కొరతతో వెదజల్లిన చేలల్లో పైరు ఎండిపోయే పరిస్థితులు తలెత్తుతున్నాయి. పది రోజులుగా మండలంలో ఎండలు మండిపోవడంతో చేలల్లో నీరు ఆవిరైపోతుంది. సాగునీటి కొరతతో నాట్లు వేసిన పైరును కాపాడుకునేందుకు రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పోల్‌రాజు కెనాల్ పరిధిలోని చిగురుకోట, నరసన్నపాలెం, చినకామనపూడి, పెదకామనపూడి, వడాలి, చినపాలపర్రు అన్నవరం, సిబి కెనాల్ పరిధిలో బొమ్మినంపాడు, కొరగుంటపాలెం, రాజానగరం తదితర గ్రామాల్లోని భూములకు సాగునీరు అందడం లేదు. దీంతో వరిచేలు ఎర్రబారి ఎండిపోతున్నాయి. పైగ్రామాల్లోని భూములకు సాగునీరు అందించేందుకు జలవనరుల శాఖ అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. కాల్వల వెంట పర్యటిస్తూ నీటి చౌర్యం జరగకుండా చర్యలు చేపట్టారు. అయినా ప్రధాన పంట కాలువలకు ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయకపోవడంతో గరువు భూములకు నీరు ఎక్కడం లేదు. దీంతో ఈ ఆయకట్టు భూముల రైతులు బ్రాంచ్ కాలువలు, మురుగు కాలువలు, పంట బోదెల్లో ఆయిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసుకుని పొలాలకు నీటిని తోడుకుంటూ వరి పైరును కాపాడుకుంటున్నారు. దీంతో రైతులకు అదనంగా ఆయిల్ ఖర్చు, ఇంజిన్ అద్దె, కూలి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని రైతులు వాపోతున్నారు. కాల్వ నుంచి ఆయిల్ ఇంజిన్ ద్వారా ఒక ఎకరం తడపడానికి ఆయిల్ ఖర్చు, ఇంజిన్ అద్దె, మనిషి కూలి కలిపి రోజుకు రూ.5 వేలు అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదల చేసే నీరు నియోజకవర్గ శివారు గ్రామాల వ్యవసాయ భూములకు అందడం లేదు. దీంతో సాగునీటి కష్టాలతో రైతులు సతమతమవుతున్నారు. ఒకపక్క ఎండలు మండిపోవడం, వర్షాలు కురవకపోవడంతో కైకలూరు నియోజకవర్గంలోని శివారు భూములకు నీరందక వరి పైరు ఎండిపోయే పరిస్థితులు కన్పిస్తున్నాయి. ఇప్పటికైనా జల వనరుల శాఖాధికారులు స్పందించి ప్రకాశం బ్యారేజీ నుంచి కైకలూరు నియోజకవర్గంలోని వ్యవసాయ భూములకు పూర్తిస్థాయిలో కాలువల ద్వారా సాగునీటిని సరఫరా చేయాలని, ఎండిపోతున్న పంట భూములను కాపాడాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ నిబంధనలు అమలు చేయరా

వికలాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అల్లాడి నటరాజ్

ప్రజాశక్తి - ఆకివీడు

విభిన్న ప్రతిభావంతులకు, వయో వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీ చేయాలంటూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాన్ని డీలర్లు అమలు చేయడం లేదని వికలాంగుల సంక్షేమ సంఘం(విసాస్) రాష్ట్ర అధ్యక్షులు అల్లాడి నటరాజ్ అన్నారు. మంత్రి ఆదేశం, ప్రభుత్వ విధానాన్ని సైతం ఆచరణలో అలసత్వం చూపుతున్నారన్నారు. ప్రభుత్వ ఆదేశాల అమలుకు కూడా వికలాంగులు రోడ్డెక్కి ఉద్యమించాలా అని ప్రశ్నించారు. రేషన్ డీలర్లు వికలాంగుల ఇంటికి రేషన్ సరుకులు పంపిణీ చేయడం లేదన్నారు. కొన్నిచోట్ల ఇంటికి వెళ్లి వేలిముద్రలను మాత్రమే వేయించుకొని రేషన్ సరుకులకు మాత్రం కుటుంబ సభ్యులు వచ్చి తీసుకొని వెళ్లాలని చెబుతున్నారని వివరించారు. జాబితాలో పేర్లు లేని వికలాంగుల వేలిముద్రలు తీసుకోవడం లేదన్నారు. సరుకులు ఇంటికి సరఫరాలో అలసత్వం వహించే రేషన్ డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. డీలర్లు, వికలాంగుల సంఘాలు, అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి ఈ పథకం సక్రమంగా అమలు చేయాలని తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ షాపులను వికలాంగులకు ఇచ్చి వారి ఆర్థిక పురోభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. అంత్యోదయ అన్న యోజన 35 కేజీల రేషన్ కార్డులను ఒంటరి వికలాంగులకు ఒంటరి రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఉషారాణి

మోతాదుకు మించి ఎరువులు వాడకం ప్రమాదకరం

ప్రొఫెసర్ పి.ఉషారాణి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మోతాదుకు మించి ఎరువులు వినియోగించడం వల్ల పంట భూమి కలుషితం అవ్వడంతోపాటు అనవసర పెట్టుబడి పెరుగుతుందని రాజమండ్రి వ్యవసాయ కళాశాల హెడ్ ప్రొఫెసర్ పి.ఉషారాణి సూచించారు. మండలంలోని వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఆవరణలోని కెవికె వద్ద ఫ్యాక్స్ వారి ఆర్థిక సహాయంతో నిర్వహిస్తున్న సమగ్ర పోషక యాజమాన్యంపై 15 రోజుల శిక్షణా కార్యక్రమం శుక్రవారం మూడో రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరపతి సంఘ సిబ్బందికి పలు అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త బి.పెదబాబు, ఫ్యాక్స్ సభ్యులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - కాళ్ల

కోపల్లె గ్రామంలో పంట కాలువ గట్టు రోడ్డు నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. కాళ్ల మండల పరిషత్ నిధులు రూ.9 లక్షలతో ఈ గ్రావెల్ రోడ్డును నిర్మిస్తున్నట్లు ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాధరాజు తెలిపారు. గ్రామ సర్పంచి బూడి నాగమణి, ఉపసర్పంచి బూడి వెంకట పర్రాలు మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

గూడెం రూరల్ సిఐగా భీమేశ్వర రవికుమార్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సిఐ రవికుమార్

తాడేపల్లిగూడెం రూరల్ సిఐగా భీమేశ్వర రవికుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన సిఐ రమేష్ బదిలీపై విజయవాడ వెళ్లారు. ఆయన స్థానంలో రవికుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలు కాపాడటానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కోడి పందేలు, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల సహకారంతో తాడేపల్లిగూడెం రూరల్, పెంటపాడు మండలాల్లో శాంతి భద్రతలు కాపాడటానికి అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న పొత్తూరి రామరాజు, టిడిపి నేతలు

పిఎం లంకలో సుపరిపాలనలో తొలి అడుగు

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని పిఎం లంక గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా డోర్ టు డోర్ క్యాంపెనింగ్ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన ప్రజోపయోగ పథకాల గురించి వివరించారు. పేదలకు సంక్షేమం, మహిళలకు ఆర్థిక స్థిరత్వం, యువతకు అవకాశాలు కల్పించే విధంగా చంద్రబాబు చేపట్టిన పథకాలు రాష్ట్రాభివృద్ధికి బలమైన పునాది అని పేర్కొన్నారు. యువతకు విద్య, ఉద్యోగావకాశాలు కల్పించడానికి నారా లోకేష్ చేస్తున్న కృషి, ఐటీ రంగం, నూతన పరిశ్రమలు, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ద్వారా నూతన అవకాశాలను కలిగిస్తున్న విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఏరియా హాస్పిటల్ డైరెక్టర్ శంకరపు వెంకటేశ్వర్లు, చిన్న వెంకటేశ్వర్లు, తిరుమాణి కృష్ణంరాజు, శంకరపు వరకుమార్, తిరుమాని అర్జున్, పొన్నమండ బాలకృష్ణ, తిరుమాని ప్రసాద్, తిరుమాని రాజగోపాల స్వామి, తిరుమాని మురళీ, తిరుమాని హేమంత్, నాగిడి రాంబాబు పాల్గొన్నారు.



శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్యకర్తలు, అభిమానులు

ఘనంగా జుత్తిగ శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - ఉండి

టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి, మహదేవపట్నం గ్రామ మాజీ సర్పంచి జుత్తిగ శ్రీనివాస్ 52వ జన్మదిన వేడుకలు అభిమానులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ జుత్తిగ శ్రీనివాస్ టిడిపి మండల అధ్యక్షునిగా 2014 నుంచి మూడు పర్యాయాలు బాధ్యతలు నిర్వర్తించడమే కాకుండా పార్టీ అధికారంలో లేనప్పటికీ పార్టీ ఉనికిని చాటి చెప్పారని కొనియాడారు. సర్పంచిగా ఉన్న సమయంలో మహదేవపట్నం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్ది అభివృద్ధి పథంలో నడిపించారని తెలిపారు. మండలంలో టిడిపిని బలోపేతం చేయడంలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 9వ తేదీ శనివారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు తెలిపారు. మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు చిట్టూరి కనకలక్ష్మి అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని జిఎంసి బాలయోగి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ తెలిపారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యాన సారె అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఇంటర్నేషనల్ వాసవీ క్లబ్ ఆధ్వర్యాన శ్రావణ శుక్రవారం సందర్భంగా స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో చీరసారె సమర్పించారు. అనిల్ దంపతులు పూలు, పండ్లు గాజులు వాసవీ మాతకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షులు పసుమర్తి అనిల్, కార్యదర్శి మండా బ్రహ్మాజీ, కోశాధికారి శ్రీధర్ గుప్తా, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొల్లేపర రాము, కోశాధికారి భోగవల్లి రమేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కష్టాల్లో గ్రామీణ ప్రాంత ఐటిఐ విద్యాసంస్థలు!

తగ్గుతున్న విద్యార్థులతో సంస్థ నిర్వహణకు ఆర్థిక భారం

ప్రజాశక్తి - పెనుమంట్ర

అంతకంతకూ తగ్గిపోతున్న విద్యార్థుల సంఖ్య వల్ల గ్రామీణ ప్రాంతాల్లో నెలకొల్పిన ప్రయివేట్ పారిశ్రామిక శిక్షణా సంస్థ కేంద్రాలు(ఐటిఐ) తీవ్రమైన కష్టాల్లో కూరుకు పోతున్నాయి. మండల కేంద్రంలో శేషశైల ఐటిఐ, మార్టేరులో కృష్ణకుమార్ ఐటిఐ ప్రస్తుతం ఎలాగోలా పడుతూ, లేస్తూ నడుస్తున్నాయి. ఇదే పరిస్థితి ఇంచుమించు ప్రతీ గ్రామీణ ప్రాంత సంస్థల్లో ఉంది. స్థానికంగా ఉన్న ఈ రెండు సంస్థల్లో ఫిట్టరు, ఎలక్ట్రికల్ విభాగాల్లో రెండు సంవత్సరాల కోర్సుల్లో విద్యార్థులు ఉన్నారు. అయితే కరోనాకు ముందు కాలంతో పోల్చుకుంటే ప్రస్తుతం ఈ కోర్సుల్లో చేరే వారు తగ్గిపోయారని సంస్థ నిర్వాహకులు వాపోతున్నారు. ఒకప్పుడు వందల సంఖ్యలో చేరేవారు ఉండగా.. ఇప్పుడు ఆ సంఖ్య పదుల్లోకి వచ్చిందని, దీనివల్ల సంస్థ నిర్వాహణ ఆర్థిక భారం అయ్యిందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా పదో తరగతి ఫెయిల్ అయిన వారు, అతి తక్కువ మార్కులతో పాస్ అయిన వారే కాక, పారిశ్రామిక విభాగం పట్ల అభిరుచి ఉన్న వారు ఈ ట్రేడ్స్ పట్ల మక్కువ చూపించి, ఐటిఐలో చేరుతారని, అయితే ఇప్పుడు యువత పంధా మారిందని అంటున్నారు. ఎక్కువ మంది స్కూల్ ఫైనల్ అయ్యాక తాపీ పనుల్లో, బిల్డింగ్ సెంట్రింగ్ పనుల్లో, పెయింటింగ్ పనుల్లో చేరి పోయి, ఏ రోజుకు ఆరోజు ఆదాయం సంపాదిస్తూ కుటుంబానికి చేదోడు, వాదోడుగా ఉంటున్నారని సామాజిక పరిశీలకులు భావిస్తున్నారు. యువత తాత్కాలిక ఆర్థిక ప్రయోజనం కోసం కాకుండా దీర్ఘకాల ప్రయోజనం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇచ్చే పారిశ్రామిక శిక్షణ పొందాలని, ఈ పరంగా వారికి ప్రభుత్వం అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

పెనుమంట్రలోని ఐటిఐ కళాశాల

దాట్ల శ్రీదేవి ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకం

షెడ్డు ప్రారంభోత్సవం చేస్తున్న అరేటి వెంకట ప్రసాద్, తదితరులు

ప్రజాశక్తి - కాళ్ల

దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు సేవలు స్ఫూర్తిదాయకమని మాజీ ఎంపిపి అరేటి వెంకట ప్రసాద్ అన్నారు. కాళ్ల గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నిర్మించిన షెడ్డును శుక్రవారం ప్రారంభోత్సవం చేశారు. దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట రామరాజు లక్ష రూపాయల ఆర్థిక సహకారంతో ఆలయం చుట్టూ షెడ్డును నిర్మించారు. శ్రావణమాసం వరలక్ష్మి వ్రతం సందర్భంగా ఆలయంలో స్వామి, అమ్మవారికి యాత్రికులు పెద్ద ఎత్తున పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. దాట్ల శ్రీదేవి ట్రస్ట్ ఆధ్వర్యాన అఖండ అన్న సమారాధన చేశారు. కాళ్ల, కాళ్లకూరు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు విచ్చేశారు. వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా దాట్ల వెంకట రామరాజు మాట్లాడుతూ దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు ద్వారా మరిన్ని సేవలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సాదు శ్రీనివాస్, గుండాబత్తుల వెంకట నాగేశ్వరరావు, మొగళ్ల మాధవరావు, బండారు నాని, బండారు సోమేశ్వరరావు, బరకాల శ్రీను పాల్గొన్నారు.

అన్న సమారాధన నిర్వహిస్తున్న ట్రస్ట్ సభ్యులు

అవగాహన కల్పిస్తున్న పిహెచ్‌సి వైద్యులు

మలేరియాపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

కొత్తపల్లి పాత పంచాయతీ వద్ద శుక్రవారం గణపవరం పిహెచ్‌సి ఆధ్వర్యాన ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిహెచ్‌ఒ జాలాది విల్సన్ బాబు స్థానికులకు మలేరియాపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ దోమల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఇంటి పరిసరాలు పొడిగా ఉంచుకోవటం వల్ల దోమలు పుట్టవన్నారు. దోమ కాటు వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులు వస్తాయని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రత అవసరమని తెలిపారు. స్థానికులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.బాల మురళీకృష్ణ, యు.మేరీరత్నం, ఎం.నల్లయ్య, ఎం.కృష్ణ పాల్గొన్నారు.

నేడు నరసాపురానికి కొవ్వలి రాక

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణానికి చెందిన టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడు శనివారం నరసాపురం రానున్నట్లు టిడిపి సీనియర్ నాయకులు శంకు భాస్కర్ నాయుడు తెలిపారు. ఈమేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. నెలరోజుల పాటు ఆయన నియోజకవర్గంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. కార్యకర్తలతో సమావేశం, సుపరి పాలనలో తొలి అడుగు తదితర కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. మరోవైపు రెండు నెలల తర్వాత కొవ్వలి నరసాపురం రావడంతో పార్టీ శ్రేణులు ఆయన ఇంటి వద్ద స్వాగతం చెప్పేందుకు పెద్ద ఎత్తున రెడీ అవుతున్నారు.

చికిత్స చేయించుకున్న వృద్ధులు

వృద్ధులకు కంటి చికిత్స

ప్రజాశక్తి - పాలకొల్లు

వాకర్స్ క్లబ్ పాలకొల్లు తరపున పది మంది పేద వృద్ధులకు రూ.45 వేలతోకంటి శస్త్ర చికిత్సలు చేయించి అనంతరం వారికి అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు చేతుల మీదుగా పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి పోతుల ఉమాశంకర్ రావు, క్లబ్ సభ్యుడు జవ్వాజి కల్యాణ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

18 నుంచి వివిధ స్వల్పకాలిక కోర్సుల్లో ఉచిత శిక్షణ

భోజనం, హాస్టల్ వసతి పూర్తిగా ఉచితం

ప్రజాశక్తి - ఏలూరు

సత్రంపాడులోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో ఈనెల 18 నుండి ఉచితంగా సీసీ కెమెరా రిపేరింగ్‌లో 13 రోజులు (పురుషులకు), పుట్టగొడుగుల పెంపకంలో 10 రోజులు (మహిళలకు, పురుషులకు), బ్యూటీపార్లర్‌కు సంబంధించి 31 రోజులు (మహిళలకు) శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎం.ఫణికిషోర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణా సమయంలో భోజనం, హాస్టల్ వసతి పూర్తిగా ఉచితమని, శిక్షణ పూర్తి చేసిన వారికి ఉచితంగా టూల్ కిట్ ఇస్తారని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు బ్యాంకు నుండి సర్టిఫికెట్, అర్హులైన అభ్యర్థులకు ముద్ర రుణానికి సిఫార్సు చేస్తారని తెలిపారు.

నేడు సిఐటియు మండల మహాసభ

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక మార్కెట్ యార్డులో సిఐటియు ఐదో మండల మహాసభ శనివారం నిర్వహించనున్నట్లు సిఐటియు మండల కార్యదర్శి జక్కుల మహేష్ తెలిపారు. ఈ మహాసభకు జిల్లా స్థాయి నాయకులు హాజరవుతున్నారని, వివిధ కార్మిక సంఘాల్లోని కార్మికులందరూ మహాసభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రాఖీల కొనుగోలుదారులతో దుకాణాలు కిటకిట

నేడు రక్షాబంధన్

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులో రాఖీల దుకాణం వద్ద కొనుగోలుదారులు

రక్షాబంధన్ పండుగను పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం ఫ్యాన్సీ, మిఠాయి దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడాయి. మండల కేంద్రం మొగల్తూరులో రక్షాబంధన్ దుకాణాలు వెలిశాయి. ఈనెల 9వ తేదీన రక్షాబంధన్ సందర్భంగా సోదరులకు రాఖీలు కట్టేందుకు సోదరీమణులు దుకాణాలకు వచ్చి రాఖీలు, మిఠాయిలు కొనుగోలు చేశారు. దీంతో స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతం కొనుగోలుదారులతో కిటకిటలాడింది.

సెప్టెంబర్ 10న బధిరోన్నత పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం శ్రీవెంకటేశ్వర బధిరోన్నత(మూగ, చెవుడు) పాఠశాల 40వ వార్షికోత్సవ వేడుకల్లో అందరూ భాగస్వాములు కావాలని, తన సంపూర్ణ సహకారం అందిస్తానని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. బధిరోన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు, బధిర క్రీడాకారుల అసోసియేషన్ ఆధ్వర్యాన సెప్టెంబర్ 10న నిర్వహించబోయే 40వ వార్షికోత్సవ వేడుకలకు సహకారం అందించాలని కోరుతూ ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఎంఎల్ఎ అంజిబాబుకు వినతిపత్రాన్ని అందించారు. టిటిడి నిర్వహిస్తున్న ఈ పాఠశాలలో అనేక మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని, వారందరిని కూడా ఈ వేడుకల్లో సత్కరించుకోవడం గొప్ప విశేషమని ఎంఎల్ఎ అంజిబాబు అన్నారు. వార్షికోత్సవ కమిటీ గౌరవాధ్యక్షులు చెరుకువాడ రంగసాయి, అధ్యక్షులు సిహెచ్.తాతారావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో ఈ పాఠశాలలోని పూర్వ విద్యార్థులు జీవనోపాధి సాగిస్తున్నారన్నారు. సెప్టెంబర్ 10వ తేదీన శ్రీవెంకటేశ్వర బధిరోన్నత పాఠశాల 40వ వార్షికోత్సవాన్ని డిఎన్ఆర్ రామకృష్ణ సభ భవనంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. సుమారు 400 మంది పాల్గొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వేడుకల సభ్యులు గొట్టుముక్కల శ్రీనివాస్ రాజు, రామచంద్ర రావు, జి.గంగాధర్, శ్రీనివాస్ రెడ్డి, జి.అప్పల స్వామి, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - పెనుమంట్ర



మాట్లాడుతున్న విద్యుత్ ఇఇ మధుకుమార్

విద్యుత్ వినియోగం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని విద్యుత్ ఇఇ కొల్లాబత్తుల మధుకుమార్(నరసాపురం) అన్నారు. ఆచంట సబ్ డివిజన్ విద్యుత్ సిబ్బందికి, విద్యుత్ వినియోగదారులకు అవగాహన పెంపొందించేందుకు విద్యుత్ శాఖ ప్రత్యేకంగా అవగాహన సదస్సును మండలంలోని మార్టేరు శ్రీవేణుగోపాల ఆడిటోరియంలో నిర్వహించింది. ఈ సదస్సుని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మధు కుమార్ ఆధ్వర్యాన నిర్వహించారు. సదస్సులో ప్రజలకు విద్యుత్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విద్యుత్ ప్రమాదాల నివారణ, నూతన మీటర్ల వ్యవస్థ, బిల్లుల భద్రత, ఆన్‌లైన్ చెల్లింపుల వల్ల లాభాలు తదితర అంశాలపై అధికారులు వివరంగా తెలియజేశారు. విద్యుత్ శాఖ అధికారులను హాజరైన ప్రజలు తమ సమస్యలను వెల్లడి చేయగా వాటిని వెంటనే పరిష్కరించేందుకు వారు హామీ ఇచ్చారు. విద్యుత్ వినియోగదారులకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని, వారికి కావాల్సిన సమాచారం ఎప్పటికప్పుడు ఇవ్వాలని, వినియోగదారుల నుంచి ఫిర్యాదు వస్తే ఆ ఉద్యోగిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మధు కుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రతినిధులు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.రామకృష్ణ, పెనుమంట్ర అసిస్టెంట్ ఇంజనీర్ జిజెజె.నాగరాజు, ఆచంట అసిస్టెంట్ ఇంజనీర్ రామారావు, పెనుగొండ అసిస్టెంట్ ఇంజనీర్ రాంబాబు, ఆచంట నియోజకవర్గంలోని అన్ని విద్యుత్ డివిజన్‌లకు చెందిన లైన్‌మెన్లు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు 108 గ్రాముల బంగారు పుష్పాలు అందజేత

త్వరలోనే అమ్మవారికి స్వర్ణ వస్త్రాన్ని పూర్తి చేస్తాం

ఎంఎల్ఎ అంజిబాబు



బంగారు పుష్పాలు అందజేస్తున్న ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

త్వరలోనే భీమవరం శ్రీమావుళ్లమ్మ అమ్మవారి స్వర్ణ వస్త్రాన్ని పూర్తి చేస్తామని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీమావుళ్లమ్మ అమ్మవారికి పట్టణానికి చెందిన భక్తులు 108 గ్రాముల బంగారు పుష్పాలను ఎంఎల్ఎ అంజిబాబు చేతుల మీదుగా ఆలయ ఇఒ బుద్ధ మహాలక్ష్మి నగేష్‌కు అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ అమ్మవారి స్వర్ణ వస్త్రానికి దాతలు ముందుకు వస్తున్నారని, సుమారు మరో 25 కేజీల బంగారం కావాల్సి ఉందని, రాష్ట్రంలోనే పేరుగాంచిన మావుళ్లమ్మ అమ్మవారికి స్వర్ణ వస్త్రాన్ని తయారు చేస్తామని అన్నారు. అనంతరం ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ ప్రత్యేక పూజలను నిర్వహించి దాతలకు ఆశీర్వచనాలు అందించి సత్కరించారు.

వరలక్ష్మి వ్రతం సందర్భంగా భీమవరం శ్రీమావుళ్లమ్మ అమ్మవారిని సుమారు 8 లక్షల గాజులతో అలంకరించారు. ఎంఎల్ఎ దర్శించుకుని భక్తులు అమ్మవారికి లక్షల్లో గాజులను అందించడం శుభ పరిణామమని అన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వరి చేలకు వెంటనే సాగునీరందించాలి

ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

సాగునీరు అందక ఎండిన వరిచేలల్లో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారని, పంటలు ఇప్పటికే బీటలు వాడుతున్నాయని, వెంటనే సాగునీరందించాలని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ కోరారు. మండలంలోని చిగురుకోటలో ఎండిన వరి పొలాలను రైతులతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిపి సత్యనారాయణ మాట్లాడుతూ వెంటనే సాగునీరందించకపోతే రైతులు పంటలను కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎల్ఎ కామినేని శ్రీనివాసరావు వెంటనే స్పందించి పంట పొలాలకు నీరందించాలని కోరారు. నీరు పంట పొలానికి అందించకుండా సముద్రాలకు పంపేయడం వల్ల తమ పంట పొలాలకు సాగునీరు అందడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే యూరియా కొరత లేకుండా చూడాలని రైతులు కోరారు. నీరు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, దీంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ విభాగం అధ్యక్షులు కోమటి విష్ణువర్ధన్, రామిశెట్టి కొండా, పోతుంబోయిన కనకదుర్గరావు, పార్టీ గ్రామ అధ్యక్షులు పేరం ధర్మ, అన్నే సురేష్‌కుమార్, కొంటి నాని, రామిశెట్టి అభిలాష్, తుమ్మ రామశాస్త్రి, బండారి మోహన్, పాల రంగారావు, బిరం మూర్తి, ఆకుల ఈశ్వర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE
IN THE COURT OF THE VII ADDL DISTRICT JUDGE, (FAMILY COURT) ELURU.
A.S.No.34/2024
Between:
Vadlapatla Venkata Subbarao ...Appellant
And
Velamati Krishna Gandhi Chowdary & Others ...Respondents
To.
R1 : Velamati Krishna Gandhi Chowdary, S/o.Late Bhupathi, R/o.H.No.2-64, Moturuvari Street, Denduluru, West Godavari District.
Where as, the appellant has filed appeal against the decree and judgment dated **20.12.2018 in O.S.No.273/2018** on the file of Addl. Senior Judge's Court, Eluru, Where as the Hon'ble Court ordered notice to you and posted the matter for your appearance. Therefore, you are called upon to appear before the Hon'ble Court on **18.08.2025 at 10.30 A.M.,** and state your objections if any, else the matter will be decided in your absence.
PYDI VENKATA RAJU,
Advocate, Eluru.
Cell: 9885199811

దావా సమన్లు (Or. 5R, 1 & 5)
చీరాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో,
O.S.No. 19/2025
Between:
బ్యాంక్ ఆఫ్ బరోడా, చింతగుంపల్లి
rep.by its Branch manager ....వాది
V/s.
శ్రీమతి కల్లపల్లి రామలక్ష్మి ...... ప్రతివాది
To:
శ్రీమతి కల్లపల్లి రామలక్ష్మి, భర్త తరుణ్,
నివాసం ఇసుకవాగు సెంటర్,
అంకమ్మ గుడి ప్రక్కన, ఒంగోలు,
ప్రస్తుత నివాసం డోర్ నెం:4-12,
యర్రావుల వీధి, చేబ్రోలు, పశ్చిమ గోదావరి జిల్లా.
పై నెంబర్ దావాని వాది అయిన బ్యాంకు వారు ప్రతివాది అయిన నీనుండి బ్యాంకుకు రావలసిన లోను బకాయిని రాబట్టుకొను నిమిత్తం దాఖలు చేసియున్నారు. ఇందు నిమిత్తమై ప్రతివాది అయిన నీకు ఏమయినా అభ్యంతరములు ఉన్న యెడల ది.03-09-2025 వ తేదిన ఉదయం 10.30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేదా వకీలు గారి ద్వారా గాని హాజరై మనవి చేసుకొన వలెను లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియచేయుటమైనది.
కోర్ట్ వారి ఆదేశాల ప్రకారము ప్రకటన జారి చేయువారు
బండారుపల్లి హేమంత్ కుమార్
అడ్వకేట్ & నోటరి (భారత ప్రభుత్వం)
చర్చి కాంపౌండ్, చీరాల - 523157

ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్)వారి కోర్టులో, తాడేపల్లిగూడెం
I.A.670/2025, I.A.671/2025
I.A.672/2025 in O.S.No.48/2018
తమ్మా పాపారావు (Died) మరికొందరు ...పిటీషనరు/వాది
మరియు
బందెల అరవ వెంకట సత్యనారాయణ అనే అరవరాజు ...రెస్పాండెంటు/ప్రతివాది
ఇందుమూలముగా తెలియచేయునది ఏమనగా పై నెంబరు దావా గ్రంథములోని వాది అయిన శ్రీ తమ్మా పాపారావు (Died) మరియు తమ్మ కనకమ్మ, W/o.తమ్మా పాపారావు, హిందూ, స్త్రీ, వయస్సు 56 సం॥లు, రామచంద్రపురం, పెంటపాడు (మం), పశ్చిమ గోదావరి జిల్లా మరియు మరికొందరు బందెల అరవ వెంకట సత్యనారాయణ అనే అరవరాజు, S/o.సుబ్బారావు, D.కుముదవల్లి (V), గణపవరం మండలం, ప.గో.జిల్లా అనువారిపై దావా దాఖలు చేయగా వారికి ఎన్నిసార్లు దావా నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుటకు ప్రయత్నించుచున్నందున వారికి పేపరు పబ్లికేషను ద్వారా సమన్లు అమలు జరిపించుటకు శ్రీకోర్టు వారు అనుమతి ఇచ్చినందున సదరు దావా గ్రంథము ది.21-08-2025 సం॥ తేదీన వాయిదా ఉన్నందున మీరు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని వకీలు ద్వారా గాని పైకోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియపరచుకొనవలెను. లేనిఎడల మీ పరోక్షమున పైనెంబరు దావా తీర్మానించబడునని తెలియ చేయడమైనది.
పైకోర్టు వారి ఉత్తర్వులతో
కొండేపాటి వెంకటేశ్వరరావు
అడ్వకేట్, తాడేపల్లిగూడెం.
సెల్: 98483 55344